RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:131

శనివారం
మే 16, 2026

పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

## నేపాలీ ముఠా దోపిడీ కేసులో పురోగతి

జవహర్‌నగర్ కేసులో ఇద్దరు అరెస్ట్



2లో

## ధర్పల్లిలో రేషన్ కార్డుల దందా..?


### ఒక్కో కార్డుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు

- రేషన్ కార్డు రాకపోవడంతో అధికారులతో లబ్ధిదారుల వాగ్వాదాలు
- కొందరికి డబ్బులు తిరిగి ఇచ్చినట్లు ప్రచారం
- మధ్యవర్తులు, రెవెన్యూ ఉద్యోగుల పాత్రపై అనుమానాలు
- ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజల డిమాండ్

2లో

**వేద న్యూస్, నిజామాబాద్ ప్రతినిధి**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు జీవనాధారంగా ఉండాల్సిన రేషన్ కార్డులు ధర్పల్లిలో డబ్బుల దందాగా మారాయనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఉచితంగా ఇవ్వాల్సిన రేషన్ కార్డుల కోసం కొందరు లబ్ధిదారుల నుంచి వేల రూపాయలు వసూలు చేశారనే ప్రచారం ఇప్పుడు మండలవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. డబ్బులు చెల్లించినా కార్డులు రాకపోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తుండగా, రెవెన్యూ కార్యాలయం వ్యవహార శైలిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.






## రైతులను నిండా ముంచుతున్న సీడ్ ఆర్గనైజర్లు!

### మాయమాటలతో అన్నదాతకు మస్కా

- చిక్కితే చివరకు మిగిలేది కన్నీళ్లే
- అధిక దిగుబడి ఆశ చూపుతున్న కేటుగాళ్లు
- పెట్టుబడి, మందులు ఫ్రీ అంటూ నమ్మబలుకుతున్న వైనం
- పండించిన పంటను 'బెరికి' పేరుతో పీకిస్తున్న ఆర్గనైజర్లు
- కమీషన్ల కక్కుర్తితో కంపెనీ ఇచ్చే డబ్బులు సైతం జేబుల్లోకే
- మాయా సీడ్ వద్దు అంటున్న నిపుణులు

2లో

**వేద న్యూస్, కరీంనగర్**

అన్నదాతను సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు నిలువునా వంచిస్తున్నారు. అధిక దిగుబడి, భారీ లాభాల ఆశ చూపి ఆడ-మగ సీడ్ వంగడాల సాగు వైపు రైతులను మళ్లించి, చివరకు వారిని అప్పుల ఊబిలోకి నెడుతున్నారు. విత్తనం వేసే ముందు పెట్టుబడి, మందులు ఉచితమంటూ మాయమాటలు చెప్పే ఆర్గనైజర్లు, తీరా పంట చేతికి వచ్చే సరికి క్వాలిటీ, బెరికి పేరుతో సాకులు చెబుతూ రైతులను నట్టేట ముంచుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలో 30 నుంచి 40 శాతం మొక్కలను వృథాగా పీకి పారేయిస్తున్నారు. పేమెంట్ సమయంలో అదనపు కమీషన్ల కోసం ఆర్గనైజర్లు చేస్తున్న కక్కుర్తి సామాన్య రైతు పాలిట శాపంగా మారింది. భారీ పెట్టుబడితో కూడిన ఈ సీడ్ సాగు కంటే, తక్కువ శ్రమతో కూడిన లోకల్ వరి వంగడాలే ముద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ గొప్ప వ్యక్తి

- సీఎం అయ్యాక ప్రజలకు దూరమయ్యారు
- ఆ సమయంలో ఒక యంత్రంలా పనిచేసేవారు
- బీఆర్ఎస్ అధినేతగా చాలా కఠినంగా ఉండేవారు
- కుటుంబ సభ్యులకే సమస్యలు చెప్పుకునే అవకాశం తక్కువ
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**వేద న్యూస్, హైదరాబాద్**

ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ ఎంతో గొప్ప వ్యక్తి అని, ఆ విషయంలో ఎవరికీ సందేహాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అయితే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అభిప్రాయపడ్డారు. ఒక మీడియా సంస్థ

మిగతా 2వ పేజీలో..




## ప్రపంచ స్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దుతా..

- పొరపాట్లు సరిదిద్దుకుంటూ లక్ష్య సాధన దిశగా..
- పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మూసీ నది పునరుజ్జీవనం అత్యంత ప్రాధాన్య అంశం
- మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్థిక ఊరట
- అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు తప్పనిసరి
- తెలంగాణ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని, ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వాటిని సరిదిద్దుకుంటూ లక్ష్య సాధన దిశగా పని చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రానున్న పదేళ్లలో తెలంగాణ ఎలా ఉండబోతోంది అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక సదస్సులో

మిగతా 2వ పేజీలో..

# నేపాలీ ముఠా దోపిడీ కేసులో పురోగతి

## జవహర్‌నగర్ దోపిడీ కేసులో ఇద్దరు అరెస్ట్

## మరో నలుగురు నిందితుల కోసం గాలింపు

**వేద న్యూస్, హైదరాబాద్**

సికింద్రాబాద్ జవహర్‌నగర్‌లో సంచలనం సృష్టించిన దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసుకు సంబంధించి నేపాలీ ముఠాలోని ప్రధాన నిందితులు మీనా, రమేశ్ దంపతులను నేపాల్ సరిహద్దుల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈనెల 11న జవహర్‌నగర్‌లోని గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో జరిగిన ఈ దోపిడీలో సుమారు 70 తులాల బంగారం, 20 కిలోల వెండి, నగదు, విదేశీ డాలర్లు దోచుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితులను నగరానికి తరలించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు సమాచారం.శ్రాంత ప్రొఫెసర్ మురళీధర మోహన్, ఆయన భార్య డాక్టర్ విజయలక్ష్మి ఇంట్లో ఇటీవల పనిలో చేరిన నేపాలీ జంట యజమానుల నమ్మకాన్ని సంపాదించిందని పోలీసులు తెలిపారు. అనంతరం మరో కొందరిని బంధువుల పేరుతో ఇంట్లోకి రప్పించినట్లు గుర్తించారు. పుట్టినరోజు వేడుకల పేరుతో ఇంట్లోకి వచ్చిన ముఠా సభ్యులు వృద్ధ దంపతులను బెదిరించి చేతులు, కాళ్లను తాళ్లతో కట్టేశారు. అనంతరం వారికి మత్తు మందు ఇచ్చి ఇంట్లోని విలువైన వస్తువులను దోచుకుని పరారైనట్లు విచారణలో తేలింది. ఈ ఘటనలో మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పనిమనుషులుగా చేర్పించిన భీమ్ అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు మిగతా నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ గొప్ప వ్యక్తి

మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కవిత, కేసీఆర్ పరిపాలన శైలిపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన ఒక యంత్రంలా పనిచేసేవారని వ్యాఖ్యానించారు. ప్రజల భావోద్వేగాలు, సమస్యలను అర్థం చేసుకునే విషయంలో దూరం ఏర్పడిందని ఆమె అభిప్రాయపడ్డారు. ఉద్యమ నాయకత్వం నుంచి పరిపాలనా బాధ్యతల్లోకి మారిన తర్వాత పరిస్థితులు మారిపోయాయని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి పార్టీ అధినేతగా కేసీఆర్ చాలా కఠినంగా ఉండేవారని కవిత తెలిపారు. కుటుంబ సభ్యులకే సమస్యలు చెప్పుకునే అవకాశం తక్కువగా ఉండేదని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉండని వ్యక్తి సామాన్య ప్రజల సమస్యలు ఎలా వింటారనే ప్రశ్నను ఆమె లేవనెత్తారు. ప్రజలతో మరింత చేరువగా ఉండాల్సిన అవసరం ఉందని పరోక్షంగా సూచించారు. ఉద్యమ నాయకుడి నుంచి యంత్రంలా పనిచేసే ముఖ్యమంత్రిగా మారిన తీరు ప్రస్తుత రాజకీయ పరిణామాలకు ఒక కారణమై ఉండవచ్చని కవిత అభిప్రాయపడ్డారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# ప్రపంచ స్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దుతా..

మొదటి పేజీ తరువాయి

ఆయన రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు, భవిష్యత్ లక్ష్యాలపై విస్తృతంగా మాట్లాడారు. సంక్షేమం నిరంతర ప్రక్రియ కాగా అభివృద్ధి మాత్రం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగాలని సీఎం పేర్కొన్నారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మేధావులు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలు సేకరించి ఈ ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఎస్సీ ఉపవర్గీకరణ, బీసీ కులగణన, రాష్ట్ర గీతం గుర్తింపు, అమరవీరుల కుటుంబాల గౌరవం వంటి ఎన్నో ఏళ్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. అలాగే తుమ్మడిహెట్టి, పాలమూరు–రంగారెడ్డి వంటి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవనం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశమని పేర్కొన్న సీఎం, నగరంలోని నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలపై ఆక్రమణలను తొలగించి సమగ్ర ప్రక్షాళన చేపడతామని చెప్పారు. కాలుష్య పరిశ్రమలను నగరానికి దూరంగా తరలించే చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మహిళల కోసం ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకం కుటుంబాలకు ఆర్థిక ఊరట కలిగించిందని, విద్యార్థుల చదువు మానివేత శాతం కూడా తగ్గిందని సీఎం తెలిపారు. ప్రజల మద్దతుతో తెలంగాణను ప్రపంచ స్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# చేప మందు ప్రసాదానికి ఏర్పాట్లు

- జూన్ 8న నాంపల్లిలో పంపిణీ
- భారీగా భక్తులు వచ్చే అవకాశం
- భద్రత, ట్రాఫిక్‌పై అధికారుల ప్రత్యేక దృష్టి

**వేద న్యూస్, హైదరాబాద్**



హైదరాబాద్‌లో ప్రతి ఏడాది ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మృగశిర కార్తె చేప మందు ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి ఏర్పాట్లు వేగం జరుగుతున్నాయి. జూన్ 8న నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ ప్రియాంక, బత్తిన కుటుంబ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, క్యూలైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులకు సూచనలు జారీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. దశాబ్దాలుగా బత్తిన గౌడ్ కుటుంబం ఈ చేప ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోంది. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఇది ఉపశమనం కలిగిస్తుందనే విశ్వాసంతో దేశం నలుమూలల నుంచి ప్రజలు హాజరవుతుంటారు. చేపలు తీసుకోని వారి కోసం ప్రత్యేకంగా మూలికా మిశ్రమం అందుబాటులో ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.

## రైతులను నిండా ముంచుతున్న

# సీడ్ ఆర్గనైజర్లు!



## మాయమాటలతో అన్నదాతకు మస్కా

- చిక్కితే చివరకు మిగిలేది కన్నీళ్లే
- అధిక దిగుబడి ఆశ చూపుతున్న కేటుగాళ్లు
- పెట్టుబడి, మందులు ఫ్రీ అంటూ నమ్మబలుకుతున్న వైనం
- పండించిన పంటను 'బెరికి' పేరుతో పీకిస్తున్న ఆర్గనైజర్లు
- కమీషన్ల కక్కుర్తితో కంపెనీ ఇచ్చే డబ్బులు సైతం జేబుల్లోకే
- మాయా సీడ్ వద్దు అంటున్న నిపుణులు

**వేద న్యూస్, కరీంనగర్**

ప్రస్తుత రోజుల్లో రైతులు అధిక దిగుబడి, భారీ లాభాల ఆశతో పంట సాగు విధానాన్నే మార్చేశారు. పూర్వం ఒక రైతు తనకున్న భూమిలో రకరకాల పంటలు వేసి ఆదాయం పొందేవాడు. కానీ నేడు అధిక లాభాల కోసం ఆడ–మగ సీడ్ వంగడాలను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీన్నే అదునుగా తీసుకుంటున్న కొన్ని సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ.. మాయమాటలతో అన్నదాతలను బురిడీ కొట్టిస్తున్నారు.

### కొండంత ఆశ.. గోరంత ఫలితం

సీడ్ కంపెనీల ఆర్గనైజర్లు రైతుల వద్దకు వచ్చి తమ కంపెనీ విత్తనాలు వాడితే రికార్డు స్థాయిలో దిగుబడి వస్తుందని, క్వింటాలుకు భారీ ధర చెల్లిస్తామని నమ్మిస్తారు. పెట్టుబడి, ఎరువులు, పురుగుల మందులు, చివరకు హార్వెస్టింగ్ కూడా ఉచితమని రకరకాల ఆఫర్లతో రైతులను ట్రాప్ చేస్తారు. తీరా సాగు మొదలుపెట్టాక కంపెనీ నుంచి వచ్చే పెట్టుబడి డబ్బులను డీలర్లు, ఆర్గనైజర్లు నొకేస్తూ.. రైతులకు మాత్రం చాలా తక్కువ మొత్తాన్ని అందిస్తున్నారు. దీంతో రైతులు గత్యంతరం లేక బయట అప్పులు చేసి లక్షల్లో పెట్టుబడి పెడుతున్నారు.

### క్వాలిటీ పేరుతో సాకులు



పంట కోతకు వచ్చే సమయంలో కంపెనీ క్వాలిటీ అధికారులు వచ్చి, పంటలో బెరికి (వృథా మొక్కలు) ఉందని సాకులు చెబుతారు. ఆ మొక్కలను తీసేస్తేనే ధాన్యం కొంటామని హెచ్చరిస్తారు. ఆరుగాలం కష్టపడి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలో దాదాపు 30 నుంచి 40 శాతం మొక్కలను బెరికి రూపంలో పీకి అవతల పారేస్తుంటే.. రైతులకు కళ్ళ నుండి నీరు కాదు రక్తం కారే పరిస్థితి ఎదురవుతోంది. అగ్రిమెంట్ ప్రకారం నష్టపరిహారం ఇస్తామని చెప్పే ఆర్గనైజర్లు, సమయానికి మాట మార్చి రైతులను నట్టేట ముంచుతున్నారు.


### సొచ్చేదాకా సోమలింగం

వడ్ల కుప్పలు పోసే వరకు మేమున్నాం.. కంపెనీతో మాట్లాడి న్యాయం చేస్తాం అని నమ్మబలికే ఆర్గనైజర్లు, పేమెంట్ సమయం వచ్చేసరికి అసలు రంగు బయట పెడుతున్నారు. కంపెనీ ఇచ్చే పూర్తి డబ్బులను రైతులకు చేరనివ్వకుండా, తమ కమీషన్ల కక్కుర్తితో అదనపు మొత్తాన్ని దొబ్బేస్తున్నారు. చివరకు మిగిలిన తక్కువ డబ్బులను కూడా సకాలంలో ఇవ్వకుండా అమావాస్యకు ఒకసారి, పున్నానికి ఒకసారి ఇస్తూ రైతుల గుండెలపై గునపాలు గుచ్చుతున్నారు. సొచ్చేదాకా సోమలింగం.. సొచ్చినాక రామలింగం అన్న చందంగా ఆర్గనైజర్ల తీరు తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### లోకల్ వరే ముద్దు..

ఆడ–మగ వరి వంగడాల సాగులో శ్రమ, పెట్టుబడి ఎక్కువగా ఉండటమే కాకుండా, అధిక రసాయనాలు వాడటం వల్ల భూసారం దెబ్బతిని పర్యావరణ కాలుష్యం కూడా ఏర్పడుతోంది. అందుకే రైతులు ఇప్పటికైనా మేల్కొని లోకల్ వరి వంగడాలను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. లోకల్ వరిలో శ్రమ, పెట్టుబడి తక్కువగా ఉండి, సురక్షితమైన దిగుబడి పొందే అవకాశం ఉంటుంది. సీడ్ కంపెనీల ట్రాప్‌లో పడకుండా ముందే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, సంబంధిత శాఖ అధికారులు స్పందించి మోసపూరిత సీడ్ కంపెనీలపై, కక్కుర్తి పడే ఆర్గనైజర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి రైతుకు అగ్రిమెంట్ కాపీ అందేలా చూసి, సకాలంలో పూర్తి డబ్బులు చెల్లించేలా బాధ్యత తీసుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

# ధర్పల్లిలో రేషన్ కార్డుల దందా..?




## ఒక్కో కార్డుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు

- రేషన్ కార్డు రాకపోవడంతో అధికారులతో లబ్ధిదారుల వాగ్వాదాలు
- కొందరికి డబ్బులు తిరిగి ఇచ్చినట్లు ప్రచారం
- మధ్యవర్తులు, రెవెన్యూ ఉద్యోగుల పాత్రపై అనుమానాలు
- ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజల డిమాండ్

**వేద న్యూస్, నిజామాబాద్ ప్రతినిధి**

పేద ప్రజలకు ఉచితంగా అందాల్సిన రేషన్ కార్డుల పేరుతో కొందరు రెవెన్యూ ఉద్యోగులు, మధ్యవర్తులు భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో గ్రామాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ధర్పల్లి రెవెన్యూ కార్యాలయంలో రేషన్ కార్డుల వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అడ్డదారులు తొక్కుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందకుండా అక్రమార్కుల చేతుల్లో చిక్కుకుపోతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు జీవనాధారంగా ఉండే రేషన్ కార్డులను కొందరు సొమ్ము చేసుకునే సాధనంగా మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో కొత్త రేషన్ కార్డు కోసం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు డబ్బులు వసూలు చేశారనే సమాచారం స్థానికంగా చక్కర్లు కొడుతోంది. కొంతమంది లబ్ధిదారులు డబ్బులు చెల్లించినప్పటికీ రేషన్ కార్డులు రాకపోవడంతో సంబంధిత అధికారులతో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొందరికి తీసుకున్న డబ్బులను తిరిగి ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మరి కొందరికి మాత్రం త్వరలో వస్తాయి అంటూ కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీతాలు తక్కువైనా విలాసవంతమైన జీవితం గడుపుతున్న కొందరు ఉద్యోగుల ఆస్తులపై కూడా గ్రామాల్లో చర్చ మొదలైంది. ఖరీదైన వాహనాలు, ఆడంబరమైన ఇళ్లు, కార్పొరేట్ పాఠశాలల్లో పిల్లల చదువులు వంటి అంశాలు ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నాయి. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని డబ్బులు దండుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు ఇస్తేనే పనులు.. లేకపోతే దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్ అన్నట్టుగా కొందరు ఉద్యోగుల వ్యవహార శైలి ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ధర్పల్లి రెవెన్యూ కార్యాలయంలో జరిగిన రేషన్ కార్డుల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు మంజూరైన రేషన్ కార్డుల జాబితాను పూర్తిగా పునఃపరిశీలించి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేద న్యూస్

శనివారం మే 16, 2026

# ఉపాధి కూలీలకు అల్పాహారం పంపిణీ

**- మండుటెండల్లో పనిచేస్తున్న కూలీలకు గ్రామ సర్పంచ్ చేయూత**
**- ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని సూచనలు**

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని రాణంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు గ్రామ సర్పంచ్ కొండల్వాడి శంకర్ అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ తీవ్రమైన ఎండల్లో పనిచేస్తున్న కూలీలకు అల్పాహారం అందించడం ఆనందంగా ఉందన్నారు. పనిచేసే సమయంలో ఎండకు సంబంధించిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గొడుగులు వెంట తీసుకురావాలని, మంచినీరు ఎక్కువగా తాగాలని తెలిపారు. పని ప్రదేశాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, నాయకులు తోట సంగయ్య, నేరుగంటి బాలరాజ్, షాదుల్, ఇతర నాయకులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# ఘనంగా లైబ్రరీ దినోత్సవ వేడుకలు

**- పాఠకులకు ఉచిత పుస్తక ప్రదర్శన**
**- విద్యార్థులకు గ్రంథాలయ వినియోగంపై అవగాహన**

**వేద న్యూస్, నల్లబెల్లి:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నల్లబెల్లి శాఖా గ్రంథాలయంలో లైబ్రరీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ ఇన్‌చార్జ్ రాపాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ ముప్పు కృష్ణ, నల్లబెల్లి గ్రామ సర్పంచ్ నాగేల్లి జ్యోతి ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠకులకు ఉచిత పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం మాట్లాడిన తహసీల్దార్ ముప్పు కృష్ణ గ్రామస్తులు గ్రంథాలయాన్ని తరచుగా సందర్శించి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సర్పంచ్ నాగేల్లి జ్యోతి ప్రకాష్ మాట్లాడుతూ ఉద్యోగ, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయంలో విస్తృతంగా అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు పరికిరత్నం, ఆర్ఐ సంపత్, చామంతి, ముచింపుల గ్రామ ఉపసర్పంచ్ బొట్ల దయాకర్, పాఠకులు శ్రీకాంత్, మోటం క్రాంతికుమార్, త్రికోవెల శ్రీకాంత్, వికలాంగుల జిల్లా అధ్యక్షుడు అడ్డరాజు, మండల నాయకులు వల్లే పర్వతాలు, యుగేందర్, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు. పుస్తక ప్రదర్శన, పుస్తక పరిచయ కార్యక్రమం విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు. గ్రంథాలయ ఇన్‌చార్జ్ రాపాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు, గ్రామస్తుల కోసం మరిన్ని పుస్తక సేవలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

# బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

**- సీపీఎం ఆధ్వర్యంలో నిరసన**

మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ మాట్లాడుతూ, భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనప్పటికీ రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే పోలీసులు అరెస్ట్ చేయడం లేదని ఆరోపించారు. చట్టాన్ని గౌరవిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. మంత్రి బెదిరింపులకు పాల్పడటం కేసును తారుమారు చేసే ప్రయత్నంగా కనిపిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి కేసుల్లో కఠినంగా వ్యవహరించాలని కోరారు. మహిళా భద్రత విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి విమల, కోడం రమణ, ఎర్రవెల్లి నాగరాజు, సూరం పద్మ, గురజాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో నిందితుడిని అరెస్ట్ చేయాలి

**- కారేపల్లిలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆందోళన**
**- కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను భర్తరఫ్ చేయాలని డిమాండ్**

**వేద న్యూస్, కారేపల్లి:**



మైనర్ బాలికపై నమోదైన పోక్సో కేసులో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో కారేపల్లి సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు సాయి భగీరథపై నమోదైన కేసులో ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కారేపల్లి-కామేపల్లి సంయుక్త మండలాల కార్యదర్శి, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్ మాట్లాడుతూ, పోక్సో కేసు నమోదై రోజులైనా నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. రాజకీయ ప్రభావంతో కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బాధిత బాలికకు భద్రత కల్పించి, కేసును ఫాస్ట్‌ట్రాక్‌లో విచారించాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని కోరారు. అనంతరం సాయి భగీరథ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తిరెడ్డి భాస్కర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# 24 ఏళ్ల తర్వాత తండ్రితో కుమారుల కలయిక



**- గద్వాల్‌లో భావోద్వేగ ఘటన**

**వేద న్యూస్, గద్వాల్ :**

జోగులాంబ గద్వాల్ జిల్లా పుటాన్‌పల్లికి చెందిన సత్యనారాయణ (65) అనే వృద్ధుడు 24 ఏళ్ల క్రితం కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయాడు. ఎన్నో ఏళ్లుగా ఆయన కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన తనిఖీల సందర్భంగా పోలీస్ కానిస్టేబుల్ అశోక్, హోంగార్డ్ రవి సత్యనారాయణను గుర్తించి ఆయన వివరాలను సేకరించారు. అనంతరం గద్వాల్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు శుక్రవారం గద్వాల్ పట్టణ సీఐ నరహరి సమక్షంలో సత్యనారాయణను ఆయన కుమారులు శివశంకర్, జ్ఞానాచారిలకు అప్పగించారు. 24 ఏళ్ల తర్వాత తండ్రిని చూసిన కుమారులు భావోద్వేగానికి గురయ్యారు. తమ కుటుంబాన్ని మళ్లీ కలిపిన పోలీసుల సేవలను వారు అభినందించారు. ఈ ఘటన స్థానికంగా హృదయాన్ని కదిలించే సంఘటనగా మారింది.

# పెంచిన ఇంధన ధరలు వెంటనే తగ్గించాలి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

**- సీపీఐ ఆధ్వర్యంలో భారీ ధర్నా, నిరసన ర్యాలీ**

పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ మండల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కోదాడఖమ్మం రోడ్డుపై భారీ ధర్నా నిర్వహించారు. మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలపై భారాలు మోపబోమని చెప్పిన కేంద్ర ప్రభుత్వం, కొద్ది రోజులకే ఇంధన ధరలు పెంచి సామాన్యులపై భారం మోపిందని ఆరోపించారు. పెరిగిన ధరలు వాణిజ్య, సామాజిక రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కర్నాటి కృష్ణయ్య భవన్ నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు ఆటోకు తాడు కట్టి నినాదాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు కాశబోయిన అయోధ్య, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పాలపాటి అశోక్, సీపీఐ నాయకులు ఎస్కే సలాం, మూడు శ్రీనివాసరావు, కొండ్రుగట్టు నాగరాజు, చెన్నబోయిన వెంకన్న, ఆటో డ్రైవర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా విష్ణువర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, కాజీపేట:**



కాజీపేట పట్టణంలోని 47వ డివిజన్ బాపూజీనగర్ కడిపికొండ ఫ్లైఓవర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు, 47వ డివిజన్ ఇంచార్జి విష్ణువర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫాతినగర్‌లోని హౌస్ ఆఫ్ జాయ్ అనాథ ఆశ్రమంలో సుమారు 70 మందికి పైగా మానసిక వికలాంగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవ తెలంగాణ వికలాంగుల జిల్లా అధ్యక్షుడు ఇప్ప శ్రీకాంత్ ముదిరాజ్, 47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అస్గర్ హుస్సేన్, సీరిల్ లారెన్స్, పసునూరి మనోహర్, తమ్మడి మధు, ఎండీ బిల్లాల్, కొమురవెల్లీ రమేష్, దొంగల కుమార్ యాదవ్, శివ కుమార్, తిరుపతి, శ్రీనివాస్, బర్ల రాజకుమార్, యూత్ ప్రెసిడెంట్ కాళేశ్వరాపు వంశీ తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల - ఆత్మకూర్ మధ్య తగ్గనున్న దూరం..!

**- రూ.123 కోట్లతో వంతెన నిర్మాణం**
**- జూరాల–కొత్తపల్లి మధ్య కృష్ణానదిలో కొనసాగుతున్న పిల్లర్ల పనులు**
**- తాత్కాలిక రహదారిపై వాహనాల రాకపోకలు**



**వేద న్యూస్, గద్వాల :**

గద్వాల జిల్లా కేంద్రంలో ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువన ప్రతిష్ఠాత్మక హైలెవల్ వంతెన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఆత్మకూర్ మండలం జూరాల గ్రామం కొత్తపల్లి మధ్య కృష్ణానదిపై రూ.123 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ వంతెన నిర్మాణం ప్రాంత ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వంతెన నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం భారీ పిల్లర్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే కాంట్రాక్టు సంస్థ తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. వంతెన పూర్తయితే గద్వాల- ఆత్మకూర్ ప్రాంతాల మధ్య దూరం గణనీయంగా తగ్గి ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. గత ఏడాది డిసెంబర్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వెంటనే తాత్కాలిక రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు.

**వివాదాలతో సాగిన ప్రాజెక్టు**

హైలెవల్ వంతెన నిర్మాణం ప్రారంభమైన నాటి నుంచి రాజకీయ వివాదాలు నెలకొన్నాయి. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా వంతెనను డ్యాం సమీపంలో నిర్మించాలని ఎంపీ డీకే అరుణ పట్టుబట్టారు. ఇరిగేషన్ శాఖ సమీక్ష సమావేశంలో కూడా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డ్యాం వద్ద వంతెన నిర్మాణంపై వ్యాఖ్యానించడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. దీనిపై కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. అభివృద్ధిని అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తే.. డ్యాం భద్రత కోసం ప్రత్యేక వంతెన నిర్మించాలని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. రెండు పార్టీల నాయకులు పోటాపోటీగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జూరాల కొత్తపల్లి మధ్య కృష్ణానదిపై నిర్మిస్తున్న ఈ వంతెనకు ప్రభుత్వం రూ.123 కోట్లు కేటాయించింది. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి. మంత్రి వాకిటి శ్రీహరి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థ, అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 18 పిల్లర్లతో నిర్మిస్తున్న ఈ వంతెనను ఏడాదిన్నరలో పూర్తి చేసే లక్ష్యంతో అధికారులు కార్యాచరణ రూపొందించారు.

వేద న్యూస్

శనివారం మే 16, 2026

# గంజాయి రవాణా ముఠా అరెస్ట్

## – రూ. లక్ష విలువైన సరుకు, కత్తులు, బైక్ స్వాధీనం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**




అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ విక్రయాలు నిర్వహిస్తున్న ఐదుగురు నిందితులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ. లక్ష విలువైన 2.2 కిలోల గంజాయి, రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అరెస్ట్ అయిన నిందితులు కనగల్ మండలానికి చెందిన బొడ్డు చందు, కానుగు సాయిరామ్, జిల్లా చందు, చాడ క్రాంతికుమార్, బొమ్మరగోని అంజి అలియాస్ నిరంజన్‌లుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిపై కనగల్ పోలీస్ స్టేషన్‌లో ఎన్డీపీఎస్ చట్టం, ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. డీఎస్పీ ఆదేశాల మేరకు చండూర్ సీఐ టి. రాము పర్యవేక్షణలో కనగల్ ఎస్ఐ కే. రాజీవ్ రెడ్డి సిబ్బందితో కలిసి మాచెర్ల జీఎల్ గార్డెన్ వెనుక తనిఖీలు నిర్వహించగా, వేపచెట్టు కింద గంజాయి పంపిణీ చేస్తున్న ఐదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. విచారణలో నిందితులు గత మూడు నెలలుగా హైదరాబాద్ ధూల్‌పేట్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక గంజాయి పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. గంజాయికి సంబంధించిన సమాచారం ఉన్న వారు 8712670266 నంబర్‌కు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని వెల్లడించారు. ఈ కేసును ఛేదించిన కనగల్ ఎస్ఐ కే. రాజీవ్ రెడ్డి, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# మెట్టుగుట్టపై మాస శివరాత్రి ప్రత్యేక పూజలు

**వేద న్యూస్, మడికొండ:**



హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణ పరిధిలోని మడికొండ గ్రామంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మెట్టుగుట్టపై శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి, అనంతరం యాగశాలలో రుద్రహోమం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రామాలయంలో విశేష అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిన మోడీ ప్రభుత్వం

## – జిల్లా కాంగ్రెస్ నేత సత్యనారాయణ గౌడ్

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు. డీజిల్, పెట్రోల్ ధరలను తరచూ పెంచడంతో మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు. రవాణా ఖర్చులు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా వ్యయాలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరల పెంపు విధానాన్ని పునరాలోచించాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనను కేంద్ర ప్రభుత్వ వైఫల్యంగా అభివర్ణించారు. పరీక్షల రద్దుతో 26 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, పిల్లల చదువుల కోసం కుటుంబాలు పడిన కష్టాలు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ప్రథమ సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానం



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల అండ్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేకాధికారిణి బి. శ్యామల తెలిపారు. ఎంపీసీ విభాగంలో 40 సీట్లు, బైపీసీ విభాగంలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, విద్యార్థినులు దరఖాస్తు ఫారాలను పాఠశాలలో సమర్పించాలని సూచించారు.

# కౌలాస్ కోటలో చతుర్భుజి సరస్వతి శిల్పం!

## – వెలుగులోకి తెచ్చిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం రాష్ట్ర కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్

**వేద న్యూస్, నిజామాబాద్ :**



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులోని జుక్కల్ మండలంలోని ప్రఖ్యాతిగాంచిన సంస్థానాలలో ఒకటైన కౌలాస్ సంస్థానంలోని 12-14వ శతాబ్దాల మధ్యకాలం నాటి ప్రాచీన కోటను భీంగల్ పట్టణానికి చెందిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కంకణాల రాజేశ్వర్ సందర్శించారు. అనేక చారిత్రాత్మక కోటలు, ఫిరంగులు, కోటలోపల గల రాణి మహల్, ఏనుగులబావి, శిథిలమైన శివాలయం, ఆయుధ శాలను పరిశీలించారు. శివాలయం పక్కనే పడి ఉన్న ఒక విగ్రహాన్ని కంకణాల రాజేశ్వర్ కనుగొన్నారు. వివరాలు తెలియ రాకపోవడంతో రాతి విగ్రహాన్ని ఫోటో తీసి కొత్త తెలంగాణ చరిత్ర బృందం రాష్ట్ర కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ కు పంపడంతో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. చరవాణిలో మాట్లాడిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం రాష్ట్ర కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఈ విగ్రహం కాకతీయ శైలికి చెందిన సరస్వతి విగ్రహంగా పేర్కొన్నారు. శ్రీరామోజు హరగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం కీర్తి ముఖతోరణంతో ఉన్న చతుర్భుజి సరస్వతి శిల్పంగా పేర్కొంటూ, సరస్వతి పరహస్తాలలో అంకుశం, పాశాలను నిజ హస్తాలలో (అక్షరమాల, అభయహస్తం ఉండాల్సిన) కుడి చేయి విరిగింది. ఎడమ చేతిలో పుస్తకం ధరించి, అర్ధ పద్మాసనంలో కనిపించిన సరస్వతి శిల్పం అందమైన హంస వాహనంగా చెక్కబడి ఉందని అన్నారు. ఇలాంటి ప్రాచీన చారిత్రాత్మక శిల్ప సంపదను కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కంకణాల రాజేశ్వర్ అన్నారు.

# విద్యార్థుల జ్ఞానదాహానికి గ్రంథాలయమే ఊపిరి

## – కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన




**వేద న్యూస్, హైదరాబాద్:**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్య వారోత్సవాల' సందర్భంగా ప్రభుత్వ సిటీ కాలేజీలో గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీమతి శ్రీదేవసేన ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన సిటీ కాలేజీ గ్రంథాలయం విద్యార్థుల జ్ఞానదాహాన్ని తీర్చుతున్న విజ్ఞాన భాండాగారమని కొనియాడారు. ఈ గ్రంథాలయ సహకారంతో విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, సెంట్రల్ యూనివర్శిటీలు, విదేశీ విద్యాసంస్థల్లో అవకాశాలు సాధిస్తున్నారని తెలిపారు. సాహిత్యంపై ఆసక్తి చూపుతున్న విద్యార్థులను అభినందించిన ఆమె, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని పేర్కొన్నారు. గ్రంథాలయాన్ని విద్యార్థి కేంద్రంగా తీర్చిదిద్దుతున్న ప్రధాన గ్రంథాలయాధికారి డా. రవికుమార్ చేగొనిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. సిహెచ్. ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 3 నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

## – రామ రాజేష్ ఖన్నా డిమాండ్

**వేద న్యూస్, హైదరాబాద్ :**



హైదరాబాద్ కమీషనర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మరియు మిషన్ డైరెక్టర్ ఎన్.హెచ్.యం. కార్యాలయం ముందు నిరసన చేసి నేషనల్ హెల్త్ మిషన్ పనిచేయుచున్నటువంటి 4వ తరగతి ఉద్యోగులకు 2021 సంవత్సరం నుండి జీవో నెంబర్ 60 ప్రకారం రూ. 15,600 వేతనం అమలు చేయాలి అతి తక్కువ కేవలం రూ.10,000 మాత్రమే ఇస్తూ తీవ్ర అన్యాయం చేస్తుందని రామ రాజేష్ ఖన్నా విమర్శించారు. ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్ హెచ్ ఎం డైరెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో నాలుగో తరగతి ఔట్సోర్సింగ్ కింద పనిచేయుచున్నారని వీరికి సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు ఇవ్వాలని అన్నారు.ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన మూడు జీవోలు 1195, 1187 ,1190 జీవోలను సవరించి తక్షణమే ఈ 2026 జులై నెల నుంచి అమలు చేయాలి, పెండింగ్లో ఉన్న 3 నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని, హెల్త్ కార్డ్స్, హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని, 7 నెలల పి.ఆర్.సి. ఏరియర్స్ తక్షణమే చెల్లించాలని, 2011 నుండి ఇప్పటి వరకు వేతన సవరణ జరగలేదు కావున వెంటనే వేతన సవరణ చేసి ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు 180 రోజులు మంజూరు చేయాలని, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు సంవత్సరానికి 35 సాధారణ సెలవులు మంజూరు చేయాలి, హర్యానా, మధ్యప్రదేశ్ ,మహారాష్ట్ర, ఝార్ఖండ్ ,ఢిల్లీ మరియు మణిపూర్ ఆ ఆ రాష్ట్రాల్లో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేశారు. కావున తెలంగాణ రాష్ట్రంలో కూడా జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులందరనీ కూడా రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ హెచ్ఎంలో అధికారులు ఈ సంస్థలో పనిచేయుచున్నటువంటి కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారని ఇందులో కొంత మందికి రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జీతాలు చెల్లిస్తూ కింది స్థాయి నాలుగవ తరగతి ఉద్యోగుల మాత్రం వారి పొట్ట కొడుతూ శ్రమదోపిడికి గురిచేస్తున్నారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ నాలుగో తరగతి ఉద్యోగుల పాకాల మల్లేశం, ఝాన్సీ, సునీత లావణ్య , విజయ, నాగరాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కోసం రైతుల పడిగాపులు

**వేద న్యూస్, కోటగిరి:**




వానాకాలం పంటల సాగు కోసం రైతులు ఎరువుల కొనుగోలుకు భారీగా తరలివస్తున్నారు. యుద్ధ ప్రభావంతో ఎరువుల ధరలు పెరిగే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో రైతులు ముందస్తుగా పాత స్టాక్ ఎరువులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కోటగిరి ప్రాథమిక సహకార కేంద్రంలో నిల్వ ఉన్న పాత స్టాక్ ఎరువులను పాత ధరలకే విక్రయిస్తుండటంతో శుక్రవారం రైతులు ఎరువుల దుకాణం వద్ద బారులు తీరారు. జూన్ నుంచి ఎరువుల ధరలు పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనతో రైతులు ఇప్పుడే కొనుగోళ్లు చేస్తున్నారు. ప్రభుత్వం వరికి మద్దతు ధరను కొద్దిపాటి మేర మాత్రమే పెంచుతుండగా, ఎరువుల ధరలు మాత్రం వందల్లో పెరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సమాచార హక్కు చట్టంతో పారదర్శకత, జవాబుదారీతనం

- రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి
- ఆర్.టీ.ఐ చట్టంపై పీఐఓలు, ఏపీఐఓలకు అవగాహన సదస్సు




**వేద న్యూస్, నిజామాబాద్ ప్రతినిధి:**

ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తూ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం - 2005 పై పీఐఓలకు, ఏపీఐఓలకు, అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, సమాచార కమిషనర్లు పీ.వీ.శ్రీనివాస్ రావు, దేశాల భూపాల్ లు హాజరయ్యారు. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రజలకు ఉపయోగమని, ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించబడిందని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం ప్రజలకు సంబంధించినదే అయినందున దానిని వారికి తెలుపడంలో అలసత్వ వైఖరి తగదని హితవు పలికారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రజాసేవకులం అన్న విషయాన్ని మరువరాదని సూచించారు. ఈ సందర్భంగా ఆయన సమాచార హక్కు చట్టంలోని 2 షెడ్యూళ్ళు, 6 చాప్టర్లు, 31 సెక్షన్ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు సంబంధించి పీ.ఐ.ఓలు, ఏ.పీ.ఐ.ఓల సందేహాలను నివృత్తి చేశారు. థర్డ్ పార్టీ ఇన్ఫర్మేషన్, వ్యక్తిగతంగా అడిగే సమాచారం, ఇవ్వవలసిన సమాచారం, ఇవ్వకూడని సమాచారం, తదితర వాటి గురించి సవివరంగా తెలియజేశారు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. సమాచార చట్టం ప్రకారం సమాచారాన్ని కోరే హక్కు ప్రతి పౌరునికి ఉండడంతో పాటు, రికార్డులను, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించే అధికారం కూడా ఉందని తెలిపారు. పౌరులు కోరినప్పుడే సమాచారం ఇవ్వడం కాకుండా, సమాచార హక్కు చట్టం, సెక్షన్ 4(1)బి ప్రకారం స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చేలా అధికార యంత్రంగాలు సమాయత్తం కావాలని సూచించారు. పబ్లిక్ అథారిటీ బాధ్యతలు, విధులు, నిర్వర్తించే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు 4(1) బి రిజిస్టర్లను అప్డేట్ చేసుకోవాలని, వీటన్నిటిని ప్రజలకు తెలిసేవిధంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం లక్ష మందికి సమాచారం అందించడం జరిగిందని తెలిపారు. మరో 15000 వరకు అప్పీల్స్ రాష్ట్ర సమాచార కమిషన్ కు వస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 20 జిల్లాలలో రాష్ట్ర సమాచార కమిషన్ పర్యటించిందని, సుదీర్ఘ కాలం నుండి పెండింగ్ లో ఉన్న పాత కేసులు అన్నింటిని పరిష్కరించడం జరిగిందని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరుకున్న సమాచారాన్ని పొందే అవకాశం ఉన్నందున పిఐఓలు, అధికార యంత్రంగాలు ప్రజల పక్షాన ఆలోచించి అడిగిన సమాచారాన్ని ఇవ్వాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని అన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు భారతదేశంలో అమలు చేస్తున్న వివరాలు తెలియజేస్తూ అధికార యంత్రంగాలు, పిఐఓలు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 1766 లోనే స్వీడన్ దేశంలో సమాచార హక్కు చట్టం అమలు ప్రారంభమైందని, 2005 సంవత్సరంలో భారతదేశంలో ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. అయినప్పటికీ ప్రపంచ దేశాల పరంగా చూస్తే ఆర్.టీ.ఐ అమలు విషయంలో భారతదేశం 4వ స్థానంలో ఉందని, దీని అమలును మరింత సమర్ధవంతంగా చేస్తూ మన దేశాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాచార కమిషనర్ పీ.వీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు, ఉద్దేశ్యాలు, 4(1)బీ కింద ఇచ్చే సమాచారం తెలియజేస్తూ ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో వివరాలను అప్డేట్ చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగాలపై ఉందని సూచించారు. సమాచార హక్కు చట్టంలోని 6(3) కింద దరఖాస్తును చక్కగా చదివి ఆకళింపు చేసుకోవాలని, ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ సరైన రీతిలో స్పందిస్తే సెకండ్ అప్పీలేట్ అథారిటీ వరకు అప్పీల్స్ అన్నారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులు అనగానే అనేక మంది ఆందోళనకు గురి అవుతారని, ఎలాంటి అనుమానాలు, అపోహలకు గురి కాకుండా దరఖాస్తుదారు కోరిన మేరకు రికార్డులలో ఉన్న సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పెండింగ్ కేసులను ఆర్.టీ.ఐ కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్లు పరిశీలించి పరిష్కరించారు. కాగా, సదస్సుకు హాజరైన రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి, కమిషనర్లు దేశాల భూపాల్, పీ.వీ.శ్రీనివాస్ రావులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర జిల్లా అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. సదస్సులో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీ.ఎఫ్.ఓ సిద్ధార్థ్ విక్రం సింగ్, అదనపు డీ.సీ.పీ ప్రకాశ్, డీ.ఆర్.ఓ బి.గీత, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



**వేద న్యూస్, సిరికొండ :**

దేశ రైతులకు మేలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం 2026-27 ఖరీఫ్ సీజన్‌కు ధాన్యం సహా 14 పంటల కనీస మద్దతు ధరలు పెంచింది. సాధారణ వరి మద్దతు ధరను రూ.2369 నుండి రూ.2441కు, గ్రేడ్-ఏ వరిని రూ.2389 నుండి రూ.2461కు పెంచుతూ క్వింటాల్‌కు రూ.72 పెంపును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని కేంద్ర కేబినెట్ 13 మే 2026న ఆమోదించింది. ఈ సందర్భంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతగా సిరికొండ మండలంలోని తూంపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు గిట్టుబాటు ధరలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అలాగే రైతు సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూంపల్లి గ్రామ సర్పంచ్ జినుక రాజేందర్, వార్డు సభ్యులు భూస రాజు, బిజేపి నాయకులు గంగామురళి రాజేశ్వర్, ప్రశాంత్, బాల్ రాజ్ ,లింగ రెడ్డి నవీన్ మరియు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా తిరుపతమ్మ బోనాలు



**వేద న్యూస్, నల్లగొండ ప్రతినిధి:**

వేములపల్లి మండల పరిధిలోని ఆమనగల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుపతమ్మ అమ్మవారి బోనాల పండుగ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్తలు ఎలగపల్లి లక్ష్మీ-వెంకటేష్ దంపతులు ముందుగా దేవాలయానికి చేరుకుని బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు రంగురంగుల వస్త్రధారణలో అలంకరించిన బోనాలను తలపై మోసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని సమర్పించారు. డప్పుల మోతలు, కోలాటాలు, భజన కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జై తిరుపతమ్మ తల్లి నినాదాలతో గ్రామమంతా భక్తిమయ వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో సుఖశాంతులు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని భక్తులు ప్రార్థించారు.

# ప్రాచీన చరిత్ర కలిగిన పెదంగంటి ఎల్లమ్మ..!







**వేద న్యూస్, భీంగల్ :**

భీంగల్ మండలంలోని బడా భీంగల్ విరజానది ఒడ్డున గల పెదంగంటి ఎల్లమ్మకు 700 సంవత్సరాల ప్రాచీన చరిత్ర ఉందని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కంకణాల రాజేశ్వర్ తెలిపారు. ఈ గ్రామ దేవత 14వ శతాబ్దానికి చెందినదిగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం రాష్ట్ర కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ రూఢీ పరిచారని అన్నారు. ప్రధాన నల్లరాతి ఎల్లమ్మ విగ్రహం యొక్క ముఖము, చేతులు భిన్నమైనందున తమ చేతుల్లో ధరించిన పరికరాలు కనిపించడం లేదు. ఈ ఎల్లమ్మ అపార శక్తి స్వరూపిణి మాతగా ఆది, మంగళ వారాలలో భక్తుల పూజలందుకుంటుంది. ఎల్లమ్మ ముందు లందలో పరశు రాముని తల్లి రేణుకా దేవి విగ్రహం ఉంది. ఎల్లమ్మ ప్రక్కనే ఒక వేప చెట్టుకు ఆనుకొని ఉన్న శిథిల రెండంతస్తుల వీరగల్లు 10వ శతాబ్దం చాళుక్యుల కాలానికి చెందిన వీరగల్లు శిల్పం ఉంది. రెండో అంతస్తులో వీరులు తలపడే తీరు గతంలో ఏ వీరగల్లులో కనబడలేదు. పై అంతస్తు విరిగిపోయింది. ఒక్క వీరున్నే రెండు వైపుల నుంచి ఇద్దరు దాడి చేస్తున్నట్టుంది. ఇలాంటి వీరగల్లు శిల్పం చాలా అరుదు. చరిత్రకారుడు కంకణాల రాజేశ్వర్ వెంట భీంగల్ సర్వసమాజ్ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు తీగల రఘు, రాంగిరి ఆనంద్ ఉన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

- గ్రంథ పాలకులు సుధాకర్



**వేద న్యూస్, శాయంపేట:**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ఇంటర్ విద్య వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గ్రంథాలయ దినోత్సవాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల శాయంపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనతో పాటు పుస్తక పఠనం ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిం చుకుంటూ డిజిటల్ లైబ్రరీ సౌకర్యాలను ఉపయోగించుకోవాలని స్థానిక శాఖ గ్రంథపాలకులు ఇంగిలి సుధాకర్ వివరించారు. అనంతరం ఇంగిలి సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, పుస్తక పఠన ప్రోత్సాహకులు గిద్దమారి సురేష్, కందగట్ల గోపాల్, ప్రిన్సిపల్ కందగట్ల కోటేష్ పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్




**వేద న్యూస్, శాయంపేట:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో శాయంపేట మండల కేంద్రంలోని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులను పోలీసులు తెల్లవారుజామునే ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్, మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్, యూత్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల శివ, టౌన్ అధ్యక్షుడు రంగు మహేందర్, మండల కార్యదర్శి ఎండీ రఫీ ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. 250 గజాల ఇంటి స్థలం, రూ.25 వేల గౌరవ పెన్షన్ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం సిగ్గుచేటని, హామీలు అమలు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే సహించేది లేదు

**- ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్**



**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో మామూనూర్ డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం మామూనూర్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఈస్ట్ జోన్ డీసీపీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ రౌడీ షీటర్ల ను హెచ్చరిస్తూ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు మరియు నేరప్రవర్తన కలిగిన వ్యక్తులు చట్టబద్ధంగా, సమాజానికి హాని కలగకుండా ప్రవర్తించాలని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, గొడవలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని. చట్టాలను గౌరవిస్తూ పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అనుమానాస్పద కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే పనులు, మద్యం, జూదం, అక్రమ వసూళ్లు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. తమ పరిసరాల్లో ఎటువంటి నేర సంఘటన జరిగినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాజంలో మంచిగా జీవిస్తూ ఉపాధి పొందేందుకు ప్రయత్నించాలని, ఫోన్ నంబర్, చిరునామా లేదా ఇతర వ్యక్తిగత వివరాల్లో మార్పులు వచ్చినప్పుడు వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకుని చట్టానికి లోబడి జీవిస్తే సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవచ్చని, లేకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని డీసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మామూనూర్ ఏసీపీ వెంకటేష్, మామూనూర్, గీసుగొండ, ఏనుమాముల ఇన్స్ స్పెక్టర్లు శ్రీనివాస్ యాదవ్, విశ్వేశ్వర్, సురేష్ సంగేం ఎస్.ఐ వంశీ కృష్ణ పాల్గొన్నారు.

# ప్రతి రోజూ వాహన తనిఖీలు నిర్వహించాలి

**- గ్రామాల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలి**
**- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు**




**వేద న్యూస్, పాపన్నపేట:**

పాపన్నపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఐపీఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులు, సీసీ కెమెరాల పనితీరు, పరిశుభ్రత, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ముఖ్యంగా మహిళలు, వృద్ధుల సమస్యలపై వెంటనే స్పందించాలని సూచించారు. గ్రామాల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేసి రాత్రి వేళల్లో పహారా నిర్వహణను కట్టుదిట్టం చేయాలని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టడంతో పాటు ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, సైబర్ నేరాలు, సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ వార్తలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ తనిఖీలో డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



**వేద న్యూస్, పాపన్నపేట:**

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పాపన్నపేట సర్పంచ్ లింగంపేట పావని నరేందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాపన్నపేట గ్రంథాలయంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఐదవ రోజు విద్యా వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శనను ఆమె రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందడంతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో కూడా పుస్తకాల ప్రాధాన్యత తగ్గలేదని, ప్రతి విద్యార్థి చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కుక్కునూరు నరేంద్ర రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మహేష్, నాయకులు ఖలీం, రాములు, శ్రీను, గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత పాల్గొన్నారు.

# ధాన్యం కేంద్రాన్ని సందర్శించిన సీపీ

**- రైతుల సమస్యలు తెలుసుకున్న పోలీసు కమిషనర్**
**- లారీల కొరతపై రైతుల ఆవేదన**
**- సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్న హామీ**



**వేద న్యూస్ వరంగల్ :**

ఆత్మకూర్ మండలం నీరుకుళ్ళ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎలా సాగుతోందో స్వయంగా పరిశీలించిన పోలీసు కమిషనర్, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరించారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. రవాణా సమస్యల వల్ల ధాన్యం నిల్వలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై స్పందించిన సన్‌ప్రీత్ సింగ్ లారీల కొరత అంశాన్ని జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, ధాన్యం కొనుగోలు కేంద్ర అధికారులు తదితరులు పాల్గొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# చైన్ స్నాచింగ్‌పై పోలీసుల విస్తృత ప్రచారం

**- అప్రమత్తంగా ఉండాలని మహిళలకు అవగాహన**



**వేద న్యూస్, మడికొండ:**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచనల మేరకు మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు చైన్ స్నాచింగ్ ఘటనలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మడికొండ సెంటర్ పరిసర ప్రాంతాల్లో మహిళలకు చైన్ స్నాచింగ్‌లపై అవగాహన కల్పిస్తూ, ప్రస్తుత కాలంలో జరుగుతున్న ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డుపై వేగంగా బైక్‌లపై వచ్చే అనుమానాస్పద వ్యక్తులను గమనించాలని తెలిపారు. ఏదైనా ప్రమాదకర పరిస్థితి ఎదురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని లేదా డయల్-100కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మడికొండ సీఐ పుల్యాల కిషన్, ఎస్సై రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ప్రమాదవశాత్తూ నీట మునిగి వ్యక్తి మృతి



**వేద న్యూస్, పాపన్నపేట:**

ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం ఏడుపాయల సమీపంలోని మంజీరా నదిలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. యూసుఫ్‌పేట గ్రామానికి చెందిన కోదండం నారాయణ (50) ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుంటూ జీవనం సాగించేవాడు. అప్పుడప్పుడు చేపలు పట్టేందుకు వెళ్లేవాడు. ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి బయలుదేరిన నారాయణ, ఏడుపాయల ఆలయ సమీపంలోని మంజీరా నదికి చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగినట్లు తెలిపారు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా, శుక్రవారం వనదుర్గామాత ఆలయ సమీపంలోని నది ఒడ్డున బండరాయిపై ఆయన బట్టలు, చెప్పులు కనిపించాయి. స్థానికుల సహాయంతో నీటిలో గాలించగా నారాయణ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి, మృతుడి భార్య దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# జిల్లా స్థాయి కమిటీ సమావేశం



**వేద న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా పోలీసు అధికారి అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొని సమీక్ష నిర్వహించారు. జిల్లాలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి సంబంధించి అమలవుతున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం. సంబంధిత శాఖల పనితీరును అధికారులు సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు లక్ష్య లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేసినట్లు తెలిసింది. అభివృద్ధి కార్యక్రమాల అమలుపై నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయం మరింత పెరగాలని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో అమలవుతున్న పథకాల పురోగతిని సమీక్షించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులు చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు పోలీసు అధికారి ఋత్విక్ సాయి కొట్టే, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత, ఆర్డీవో జగదీశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారం.. కానిస్టేబుల్‌కు 30 ఏళ్ల జైలు శిక్ష



**వేద న్యూస్ హైదరాబాద్ :**

మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ కానిస్టేబుల్‌కు పోక్సో ప్రత్యేక కోర్టు జైలు శిక్ష విధించింది. బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో కానిస్టేబుల్ వరదరాజ్ సుదేశ్‌కు జైలు శిక్ష వేస్తూ తీర్పు నిచ్చింది. పోక్సో స్పెషల్ కోర్టు శుక్రవారం విచారణలో వరదరాజ్‌పై అత్యాచారం, పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో 30 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అంతేకాదు నిందితుడికి రూ.12 వేల జరిమానా వేసింది కోర్టు. అలానే బాధిత బాలికకు రూ.1 లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

వేద న్యూస్

శనివారం మే 16, 2026

# ఐటీఆర్ దాఖలు ప్రారంభం.. విడుదలైన కొత్త ఫారాలు

**వేద న్యూస్ డెస్క్:**

పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను శాఖ కీలక ప్రకటన చేసింది. 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలు ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐటీఆర్-1 (సహజ్), ఐటీఆర్-4 (సుగం) ఫారాలకు సంబంధించిన ఎక్సెల్ యుటిలిటీలను ఈ-ఫైలింగ్ వేదికలో అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో పన్ను చెల్లింపుదారులు తమ రిటర్నులను ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానంలో కూడా దాఖలు చేసుకునే అవకాశం కల్పించింది. ఆదాయపు పన్ను శాఖ సామాజిక మాధ్యమ వేదిక ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. పన్ను చెల్లింపుదారులు నేరుగా ఈ-ఫైలింగ్ వేదికలో ఫారాలను నింపి సమర్పించవచ్చని తెలిపింది. అలాగే ఎక్సెల్ యుటిలిటీని డౌన్‌లోడ్ చేసుకుని ఆఫ్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి, అనంతరం జేసన్ దస్త్రాన్ని రూపొందించి అప్‌లోడ్ చేసే సదుపాయం కూడా కల్పించినట్లు పేర్కొంది. ఆడిట్ పరిధిలోకి రాని పన్ను చెల్లింపుదారులకు సాధారణంగా జులై 31 వరకు గడువు ఉంటుంది. వార్షిక ఆదాయం రూ.50 లక్షల వరకు ఉన్న నివాస భారతీయులు ఐటీఆర్-1 (సహజ్) ఫారాన్ని ఉపయోగించవచ్చు. అలాగే రూ.50 లక్షల వరకు ఆదాయం ఉన్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు, పరిమిత బాధ్యత భాగస్వామ్య సంస్థలు మినహా ఇతర సంస్థలు ఐటీఆర్-4 (సుగం) ఫారాన్ని దాఖలు చేయవచ్చు.




ఈసారి కొత్త నిబంధనలతో కూడిన ఫారాలను కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి ఇప్పటికే ప్రకటించింది. దీర్ఘకాలిక మూలధన లాభాలు, షేర్ల తిరిగి కొనుగోలు లావాదేవీల వల్ల కలిగిన నష్టాలకు సంబంధించిన అదనపు వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. మరోవైపు 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 5.12 శాతం వృద్ధితో రూ.23,40,406 కోట్లకు చేరినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి గణాంకాలు వెల్లడించాయి.

# ఎయిర్‌టెల్ నుంచి 56 ఎడ్జ్ డాటా సెంటర్లు

**వేద న్యూస్ డెస్క్:**




దేశీయ టెలికాం రంగ దిగ్గజ సంస్థ భారతి ఎయిర్‌టెల్ దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో ఎడ్జ్ డాటా సెంటర్ల ఏర్పాటుకు సిద్ధమైంది. వచ్చే రెండేళ్లలో దేశంలోని పలు కీలక నగరాల్లో మొత్తం 56 ఎడ్జ్ డాటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గోపాల్ విట్టల్ వెల్లడించారు. డిజిటల్ సేవల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, వినియోగదారులకు మరింత వేగవంతమైన డేటా సేవలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, క్లౌడ్ సేవలు, ఐఓటీ, ఐదు జీ సేవల విస్తరణకు ఈ ఎడ్జ్ డాటా సెంటర్లు కీలకంగా మారనున్నాయి. దేశవ్యాప్తంగా వ్యాపార విస్తరణను మరింత వేగవంతం చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు కంపెనీ పేర్కొంది. స్థానిక స్థాయిలో డేటా ప్రాసెసింగ్ సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల లేటెన్సీ తగ్గి, వినియోగదారులకు మెరుగైన ఇంటర్నెట్ అనుభవం లభించనుంది.

# ఒమన్-భారత్ గ్యాస్ పైప్‌లైన్‌కు మళ్లీ ఊపిరి



**వేద న్యూస్ డెస్క్:**

హర్మూజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఒమన్ నుంచి గుజరాత్‌కు సముద్ర గర్భం ద్వారా సహజవాయువును తరలించే భారీ పైప్‌లైన్ ప్రాజెక్టును మళ్లీ పరిశీలనలోకి తీసుకుంది. 'మిడిల్ ఈస్ట్-ఇండియా డీప్‌వాటర్ పైప్‌లైన్' పేరుతో ప్రతిపాదిత ఈ ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశించినట్లు సమాచారం. హర్మూజ్ జలసంధిలో ఇటీవల నెలకొన్న సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు, సహజవాయువు రవాణా తీవ్రంగా దెబ్బతిన్నది. భారత్ తన వంటగ్యాస్ అవసరాల్లో దాదాపు 90 శాతం, ద్రవీకృత సహజవాయువు అవసరాల్లో 60 శాతం ఈ మార్గం ద్వారానే దిగుమతి చేసుకుంటోంది. ఈ పరిణామాల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో సహజవాయువు ధరలు భారీగా పెరగడంతో, కేంద్రం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రకారం ఒమన్‌లోని రాస్ అల్ జిఫాన్ ప్రాంతం నుంచి అరేబియా సముద్రం గుండా గుజరాత్‌లోని పోర్‌బందర్ వరకు సముద్ర గర్భంలో పైప్‌లైన్ నిర్మించనున్నారు. సుమారు 2 వేల కిలోమీటర్ల పొడవుతో, 3,450 మీటర్ల లోతులో ఈ పైప్‌లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రోజుకు 31 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజవాయువును తరలించే సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారు. మొత్తం వ్యయం సుమారు రూ.40 వేల కోట్లుగా అంచనా వేస్తున్నారు.గతంలో అధిక వ్యయం, సాంకేతిక సమస్యల కారణంగా ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. అయితే డీప్‌వాటర్ సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన పురోగతితో ఇప్పుడు ఇది సాధ్యమవుతుందని నిపుణులు భావిస్తున్నారు. నిర్మాణానికి అవసరమైన అనుమతులు లభిస్తే ఐదు నుంచి ఏడేళ్లలో పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు

# నాట్కో ఫార్మాకు రూ.4.92 కోట్ల నోటీసు


**వేద న్యూస్ డెస్క్:**



రెండు ఔషధాలను అధిక ధరలకు విక్రయించారనే ఆరోపణలపై జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ నాట్కో ఫార్మాపై చర్యలు చేపట్టింది. ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వులు2013 నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన అనంతరం సంస్థకు రూ.4.92 కోట్ల డిమాండ్ నోటీసును జారీ చేసింది. జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ ఆదేశాల ప్రకారం జరిమానాతో పాటు వడ్డీ కలిపి మొత్తం రూ.4,92,25,923ను డిపాజిట్ చేయాలని నాట్కో ఫార్మాకు సూచించింది. ఈ విషయాన్ని సంస్థ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు అధికారికంగా తెలియజేసింది. ఏప్రిల్ 2023 నుంచి నవంబర్ 2023 మధ్యకాలంలో రెండు కీలక ఔషధాలను నిర్ణయించిన ధరలకు మించి విక్రయించినట్లు వచ్చిన ఫిర్యాదులపై సంస్థ విచారణ చేపట్టింది. విచారణ అనంతరం నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించి ఈ నోటీసు జారీ చేసినట్లు సమాచారం. ఔషధాల ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం, సంస్థలు నిర్ణయించిన పరిమితికి మించి ధరలు వసూలు చేయరాదు. ఉల్లంఘన జరిగితే అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈ పరిణామం ఔషధ రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఔషధ కంపెనీలు ధరల నియంత్రణ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# చెన్నై గూటికి కుల్దీప్.. ఆర్సీబీ స్క్వాడ్‌లో ఇంగ్లండ్ పేసర్..!

**వేద న్యూస్ డెస్క్:**




ఐపీఎల్ 2026 సీజన్ చివరి దశకు చేరుకుంటుండగా ప్లే ఆఫ్స్ పోరు మరింత ఉత్కంఠభరితంగా మారుతోంది. ఈ కీలక సమయంలో జట్లు తమ స్క్వాడ్లను మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నాలు వేగవంతం చేశాయి. గాయాల కారణంగా టోర్నీకి దూరమైన ఆటగాళ్ల స్థానాల్లో కొత్త ప్లేయర్లను తీసుకుంటూ ఫ్రాంచైజీలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. తాజాగా చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తమ స్క్వాడ్లలో మార్పులు ప్రకటించాయి. ప్లే ఆఫ్స్ రేసులో తిరిగి బలంగా నిలిచేందుకు ప్రయత్నిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్ జట్టు.. గాయపడిన సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్ స్థానంలో యువ పేసర్ కుల్దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకుంది. ఈ విషయాన్ని చెన్నై యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. రూ.30 లక్షల ఒప్పందంతో కుల్దీప్ సీఎస్కేలో చేరాడు. గతంలో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన అనుభవం ఉన్న కుల్దీప్.. ఇప్పుడు పసుపు జెర్సీలో తన ప్రతిభ చాటుకోవాలని ఉత్సాహంగా ఉన్నాడు. ఇప్పటికే చెన్నై జట్టు జేమీ ఓవర్టన్ స్థానంలో దక్షిణాఫ్రికా యువ ఆల్‌రౌండర్ డియాన్ ఫారెస్టర్‌ను జట్టులోకి చేర్చుకుంది. అంతర్జాతీయ స్థాయిలో కొత్తగానే అడుగుపెట్టిన ఫారెస్టర్‌పై సీఎస్కే యాజమాన్యం భారీ నమ్మకం ఉంచింది. వేగవంతమైన బౌలింగ్‌తో పాటు దూకుడైన బ్యాటింగ్ చేయగల సామర్థ్యం అతడికి ఉండటంతో జట్టుకు ఉపయోగపడతాడని భావిస్తోంది. ఇక డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కూడా కీలక మార్పు చేసింది. గాయంతో బాధపడుతున్న శ్రీలంక పేసర్ నువాన్ తుషార స్థానంలో ఇంగ్లండ్‌కు చెందిన రిచర్డ్ గ్లీసన్‌ను జట్టులోకి తీసుకుంది. ఫిట్‌నెస్ టెస్టులో తుషార విఫలం కావడంతో ఆర్సీబీ ఈ నిర్ణయం తీసుకుంది. రిచర్డ్ గ్లీసన్‌కు బెంగళూరు యాజమాన్యం రూ.1.6 కోట్ల ఒప్పందం కుదుర్చినట్లు సమాచారం. అంతర్జాతీయ టీ20ల్లో అనుభవం ఉన్న గ్లీసన్ తన వేగం, లైన్ అండ్ లెంగ్త్‌తో గుర్తింపు పొందాడు. కీలక సమయాల్లో వికెట్లు తీసే సామర్థ్యం ఉండటంతో ఆర్సీబీ బౌలింగ్ విభాగానికి అతడు బలం చేకూర్చనున్నాడు. ప్లే ఆఫ్స్‌కు ముందు జట్లు చేస్తున్న ఈ మార్పులు టోర్నీని మరింత ఆసక్తికరంగా మార్చుతున్నాయి. అభిమానులు కూడా కొత్త ఆటగాళ్ల ప్రదర్శనపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# స్లో ఓవర్ రేట్‌తో పాక్‌కు భారీ షాక్.. డబ్ల్యూటీసీలో 8 పాయింట్ల కోత



**వేద న్యూస్ డెస్క్:**

పాకిస్థాన్ జాతీయ క్రికెట్ జట్టుకు బంగ్లాదేశ్ పర్యటనలో వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తొలి టెస్టులో దారుణ ఓటమి పాలైన పాకిస్థాన్‌కు ఇప్పుడు స్లో ఓవర్ రేట్ రూపంలో మరో భారీ షాక్ ఎదురైంది. నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయకపోవడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆ జట్టుపై కఠిన చర్యలు తీసుకుంది. ఢాకా టెస్టులో స్లో ఓవర్ రేట్ కారణంగా పాకిస్థాన్ జట్టుకు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో కీలకమైన 8 పాయింట్ల కోత విధించారు. అంతేకాకుండా ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 40 శాతం జరిమానా కూడా విధించినట్లు సమాచారం. షాన్ మసూద్ నాయకత్వంలోని పాక్ జట్టు నిర్ణీత సమయానికి ఎనిమిది ఓవర్లు వెనుకబడటంతో ఈ శిక్ష తప్పలేదు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 సీజన్‌లో ఈ పాయింట్ల కోత పాకిస్థాన్ ర్యాంకింగ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా జాతీయ క్రికెట్ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతుండగా, న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టు రెండో స్థానంలో ఉంది. దక్షిణాఫ్రికా జాతీయ క్రికెట్ జట్టు, శ్రీలంక జాతీయ క్రికెట్ జట్టు తర్వాత పాకిస్థాన్ ఐదో స్థానానికి పడిపోయింది. ఢాకా వేదికగా జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ జాతీయ క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించింది. ముఖ్యంగా బంగ్లా యువ పేసర్ నహీద్ రాణా బంతితో చెలరేగి పాకిస్థాన్ బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసి మ్యాచ్‌ను పూర్తిగా బంగ్లాదేశ్ వైపు తిప్పేశాడు. మొదటి ఇన్నింగ్స్‌లో కొంత ప్రతిఘటన చూపిన పాకిస్థాన్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం పూర్తిగా చేతులెత్తేసింది. నహీద్ రాణా ధాటికి బ్యాటింగ్ లైనప్ కుప్పకూలడంతో బంగ్లాదేశ్ 104 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో స్వదేశంలో పాకిస్థాన్‌పై తొలి టెస్టు విజయాన్ని నమోదు చేసిన బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ కెప్టెన్ షాన్ మసూద్ చేసిన వ్యాఖ్యలకు బంగ్లా జట్టు తమ ఆటతోనే సమాధానం చెప్పిందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు మే 16 నుంచి ప్రారంభంకానుంది. తొలి మ్యాచ్ విజయోత్సాహంతో బంగ్లాదేశ్ సిరీస్ కైవసం చేసుకోవాలని భావిస్తుండగా, పరువు నిలబెట్టుకోవాలంటే పాకిస్థాన్ తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# వన్డే ప్రపంచకప్‌పై కోహ్లీ మనసులో మాట.. "నాకూ ఆడాలనే ఉంది"

**వేద న్యూస్ డెస్క్:**



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి తన క్లాస్ బ్యాటింగ్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేస్తున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో తొమ్మిదో శతకంతో చెలరేగిన కోహ్లీ.. తనలో ఇంకా ఎంత క్రికెట్ మిగిలి ఉందో మరోసారి నిరూపించాడు. వరుసగా రెండు గోల్డెన్ డకౌట్‌ల తర్వాత సెంచరీతో అదరగొట్టిన అతడి ఆటతీరు చూస్తుంటే మరో రెండేళ్ల పాటు అతడికి తిరుగులేదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా 2027 వన్డే ప్రపంచకప్‌లో కూడా కోహ్లీ ఆడాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇదే విషయంపై తాజాగా కోహ్లీ కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన విరాట్ కోహ్లీ.. తనకు ఇంకా ప్రపంచకప్ ఆడాలనే కోరిక ఉందని స్పష్టం చేశాడు. "దేశం తరఫున ప్రపంచకప్ ఆడడం కంటే గొప్ప విషయం ఇంకేముంటుంది" అంటూ నవ్వుతూ సమాధానం ఇచ్చాడు. ఈ వ్యాఖ్యలతో కోహ్లీ అభిమానుల్లో కొత్త ఆశలు చిగురించాయి. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటికే ఎన్నో రికార్డులు సృష్టించిన కోహ్లీ.. ముఖ్యంగా వన్డేల్లో తనకంటూ ప్రత్యేక చరిత్ర నిర్మించాడు. 50కి పైగా సెంచరీలు బాది ప్రపంచ రికార్డు నెలకొల్పిన విరాట్.. ప్రస్తుతం తన పూర్తి దృష్టిని 2027 వన్డే ప్రపంచకప్‌పైనే పెట్టినట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా పర్యటనలో, ఆ తర్వాత దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌లో శతకాలతో చెలరేగిన అతడు.. దేశవాళీ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలోనూ అద్భుత ప్రదర్శన చేశాడు. ఇప్పుడు ఐపీఎల్ 19వ సీజన్‌లోనూ యువ ఆటగాడిలా ఉత్సాహంగా ఆడుతూ అభిమానులను అలరిస్తున్నాడు. తన ఆటతీరుపై కోహ్లీ మాట్లాడుతూ.. "మైదానంలోకి దిగాక జట్టులో ఉత్సాహం నింపడం, జట్టు విజయానికి సహకరించడం మీదే నా దృష్టి ఉంటుంది. నేను ఎవరికీ ఏం నిరూపించుకోవాలని ఆడను. ఎందుకంటే మ్యాచ్‌కు సిద్ధమయ్యే విధానం, ఆట పట్ల నా అంకితభావం గురించి నాకు పూర్తి నమ్మకం ఉంది. అందుకే తలదించుకుని నెట్స్‌లో కష్టపడుతుంటాను" అని చెప్పాడు.ఇంకా మాట్లాడుతూ.. "నా కెరీర్‌లో నాకు లభించిన ప్రతిదానికి దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటాను. భారత్ తరఫున ఆడే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తాను. వన్డేల్లో 40 ఓవర్లు బౌండరీ నుంచి బౌండరీకి పరుగెత్తమన్నా సిద్ధంగా ఉంటాను. 50 ఓవర్ల క్రికెట్‌కు తగ్గట్టుగా నేను ఎప్పుడూ ఫిట్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తాను. నేను ఎదుర్కొనే ప్రతి బంతిని నా కెరీర్‌లో చివరి బంతిలా భావించి ఆడతాను. జట్టుకు అవసరమైతే ఏ పాత్రనైనా పోషించేందుకు సిద్ధంగా ఉంటాను" అని కోహ్లీ పేర్కొన్నాడు.

వేద న్యూస్



# నాగశౌర్యపై క్రష్.. పెళ్లిపై అనన్య ఆసక్తికర వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటి అనన్య నాగళ్ల తాజాగా తన వ్యక్తిగత జీవితం, ప్రేమ, పెళ్లి, సినీ ప్రయాణం గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. 'మల్లేశం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ తెలుగమ్మాయి, తర్వాత పవన్ కళ్యాణ్ నటించిన వకీల్ సాబ్ చిత్రంతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతున్న అనన్య, ఒక ఇంటర్వ్యూలో తన మనసులోని అనేక విషయాలను అభిమానులతో పంచుకుంది. ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, టాలీవుడ్ యువ హీరో నాగశౌర్య తన మొదటి క్రష్ అని అనన్య వెల్లడించింది. చిన్నప్పటి నుంచి అల్లు అర్జున్, మహేష్ బాబు, ప్రభాస్ సినిమాలు చూస్తూ పెరిగానని, వారి నటన, స్టైల్ అంటే తనకు చాలా ఇష్టమని తెలిపింది. అయితే ఇండస్ట్రీలో ప్రత్యేకంగా తనకు నచ్చిన హీరో ఎవరైనా ఉన్నారా అని అడిగితే మాత్రం వెంటనే నాగశౌర్య పేరు చెప్పింది. "ఆయన సినిమాలు, మాట్లాడే తీరు నాకు చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి ఆయనపై ప్రత్యేకమైన అభిమానం ఉంది" అని చెప్పుకొచ్చింది. ప్రేమ, పెళ్లి విషయాలపై కూడా అనన్య ఓపెన్‌గా స్పందించింది. "నాకు కాబోయే వ్యక్తి చాలా నిజాయితీగా ఉండాలి. ప్రస్తుతం సరైన వ్యక్తి కోసం ఎదురుచూస్తున్నాను. జీవితంలో అర్థం చేసుకునే మనసున్న వ్యక్తి కావాలి. సంబంధాల్లో నమ్మకం చాలా ముఖ్యం" అని తెలిపింది. సినీ పరిశ్రమకు చెందిన వారితో రిలేషన్ పెట్టుకోవడంపై మాత్రం కొంత భయం ఉందని చెప్పింది. "ఇండస్ట్రీలో అభిప్రాయ భేదాలు, ఒత్తిడులు ఎక్కువగా ఉంటాయి. అందుకే కొన్నిసార్లు రిలేషన్‌షిప్స్ నిలబడటం కష్టమవుతుంది" అని అభిప్రాయపడింది. అంతేకాకుండా ఇప్పటివరకు తనకు ఎవరూ ప్రేమను వ్యక్తం చేయలేదని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది. "నిజంగా ఇప్పటివరకు ఎవరూ నన్ను ప్రపోజ్ చేయలేదు. నేను కూడా నా పని, కెరీర్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టాను" అంటూ నవ్వుతూ చెప్పింది. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. సినీ పరిశ్రమలో తరచూ చర్చకు వచ్చే క్యాస్టింగ్ కౌచ్ అంశంపై కూడా అనన్య స్పందించింది. తనకు ఇప్పటివరకు అలాంటి చేదు అనుభవాలు ఎదురుకాలేదని స్పష్టం చేసింది. "ప్రతి ఒక్కరి ప్రయాణం వేరు. నాకు ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. నేను ఎప్పుడూ నా పనిపైనే దృష్టి పెడతాను" అని పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే విమర్శలను పెద్దగా పట్టించుకోనని, నెగెటివ్ కామెంట్స్‌ను పట్టించుకుంటే ముందుకు వెళ్లలేమని తెలిపింది. అనన్య నాగళ్ల సినీ ప్రయాణం కూడా చాలా ఆసక్తికరంగా సాగింది. అసలు ఆమె లక్ష్యం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడమే. బీటెక్ పూర్తి చేసిన తర్వాత హైదరాబాద్‌లోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం కూడా చేసింది. అయితే నటనపై ఉన్న ఆసక్తితో ఉద్యోగంతో పాటు షార్ట్ ఫిల్మ్‌లో నటించడం ప్రారంభించింది. అలా ఆమె ప్రతిభను గుర్తించిన దర్శకుడు రాజ్ ఆర్ ఆమెకు మల్లేశం సినిమాలో అవకాశం ఇచ్చారు. ఆ సినిమాలో మల్లేశం భార్య పాత్రలో అనన్య నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఆమె కెరీర్‌కు అసలైన మలుపు తీసుకొచ్చింది మాత్రం పవన్ కళ్యాణ్ నటించిన వకీల్ సాబ్ చిత్రం. ఆ సినిమాలో 'దివ్య' పాత్రలో ఆమె చూపించిన భావోద్వేగ నటన ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంటూ టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారింది. ప్రస్తుతం అనన్య నాగళ్ల చేతిలో పలు తెలుగు చిత్రాలు ఉన్నట్లు సమాచారం. నటిగా మాత్రమే కాకుండా సహజమైన వ్యక్తిత్వంతో కూడా అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ యువ నటి, భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయికి చేరుకుంటుందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# రామ్ కొత్త అవతారం.. 'వీర'తో దర్శకుడిగా ఎంట్రీ


**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన అభిమానులకు అదిరిపోయే పుట్టినరోజు కానుక ఇచ్చారు. ఇప్పటివరకు నటుడిగా, డ్యాన్సర్‌గా ప్రేక్షకులను అలరించిన రామ్.. ఇప్పుడు దర్శకుడిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తన 23వ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం కాబోతున్నట్లు వెల్లడించడంతో సినీ వర్గాల్లో ఈ వార్త సంచలనంగా మారింది. 'వీర' పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రం సైకాలజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్నట్లు సమాచారం. విడుదల చేసిన పోస్టర్‌లో 'ఒంటరి తోడేలు కథ' అనే భావాన్ని ప్రతిబింబించే ట్యాగ్‌లైన్‌తో రామ్ పాత్రను అత్యంత తీవ్రంగా చూపించారు. పోస్టర్ చూస్తుంటే ఈ సినిమాలో రామ్ పూర్తిగా కొత్త తరహా పాత్రలో కనిపించనున్నట్లు స్పష్టమవుతోంది. ఈ చిత్రంతో రామ్ మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. ఇప్పటికే కుటుంబ నిర్మాణ సంస్థ ఉన్నప్పటికీ, ప్రత్యేకంగా 'రాపో సినిమాటిక్స్' పేరుతో కొత్త నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ఈ చిత్రాన్ని రామ్ సోదరుడు కృష్ణ పోతినేని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నారు. దర్శకుడిగా తన నిర్ణయంపై స్పందించిన రామ్.. "ఇన్నాళ్లు వాళ్ల కథల్లో నా ముఖం చూశారు.. ఇక ఈ కథలో నా గొంతు వింటారు" అంటూ భావోద్వేగ వ్యాఖ్య చేశారు. ఈ వ్యాఖ్య ప్రస్తుతం అభిమానులను ఆకట్టుకుంటోంది. రామ్‌లోని కొత్త కోణాన్ని ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులు చూడబోతున్నారని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కనున్న ఈ చిత్రం 2026 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# 'పెద్ది'లో గౌరనాయుడు ఎంట్రీ

**వేద న్యూస్ డెస్క్:**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' చిత్రంపై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించగా.. తాజాగా చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక వీడియో అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ వీడియోలో కన్నడ స్టార్ నటుడు శివరాజ్‌కుమార్ పాత్రను పరిచయం చేశారు. 'పెద్ది' సినిమాలో శివరాజ్‌కుమార్ 'గౌరనాయుడు' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. మట్టి కుస్తీకి శిక్షణ ఇచ్చే కఠినమైన గురువుగా ఆయన నటిస్తున్నట్లు వీడియో ద్వారా స్పష్టమైంది. సాధారణ క్రికెటర్‌గా ఉన్న హీరోను ఓ యోధుడిగా తీర్చిదిద్దే పాత్రలో ఆయన కనిపించనున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా విడుదలైన వీడియోలో శివరాజ్‌కుమార్ మాస్ లుక్, పవర్‌ఫుల్ బాడీ లాంగ్వేజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శిష్యుడికి కఠినంగా శిక్షణ ఇస్తున్న సన్నివేశాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చిత్రీకరణ సమయంలో తీసిన కొన్ని వెనుకతెర దృశ్యాలను కూడా వీడియోలో చూపించారు. రామ్ చరణ్, శివరాజ్‌కుమార్ కలిసి కనిపించిన కొన్ని క్షణాలు అభిమానుల్లో సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ చిత్ర ట్రైలర్‌ను మే 18న భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. గ్రామీణ నేపథ్యంలో క్రీడా, భావోద్వేగ అంశాల మేళవింపుగా దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రామ్ చరణ్ కెరీర్‌లో ఇది ప్రత్యేకమైన పాత్రగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, జగపతిబాబు, బోమన్ ఇరానీ, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పలుమార్లు వాయిదా పడిన 'పెద్ది' చిత్రం జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. టాలీవుడ్‌లో మరో భారీ విజయంగా నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# 'స్పిరిట్' కోసం ప్రభాస్ భారీ ప్రణాళిక

**వేద న్యూస్ డెస్క్:**



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'బాహుబలి' తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన ప్రభాస్.. ఇటీవల 'సలార్', 'కల్కి 2898 ఏడీ' విజయాలతో మరోసారి తన బాక్సాఫీస్ సత్తాను నిరూపించారు. ఇప్పుడు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' సినిమాతో మరింత పవర్‌ఫుల్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజా సమాచారం ప్రకారం, 'స్పిరిట్' సినిమా కోసం చిత్ర బృందం ఏకధాటిగా అరవై రోజుల పాటు కొనసాగే భారీ చిత్రీకరణ షెడ్యూల్‌ను సిద్ధం చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ఒక్క షెడ్యూల్‌లోనే కథకు సంబంధించిన కీలక భాగాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో దర్శకుడు ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా సినిమాలకు ప్రత్యేకమైన మాస్ టేకింగ్, భావోద్వేగ సన్నివేశాలు ప్రధాన బలంగా నిలుస్తాయి. ఈ నేపథ్యంలో హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగాలకు సంబంధించిన కీలక ఎపిసోడ్‌లను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రంలో ప్రభాస్ తొలిసారి ఒక తీవ్ర భావోద్వేగాలతో నిండిన ఐపీఎస్ అధికారి పాత్రలో కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. ఒక బలమైన కారణంతో జైలుకు వెళ్లే పోలీస్ అధికారిగా ఆయన పాత్ర ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పాత్ర కోసం ప్రభాస్ ప్రత్యేక శిక్షణ కూడా తీసుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభాస్ ఒకేసారి పలువురు స్టార్ దర్శకులతో భారీ ప్రాజెక్టులను సమన్వయం చేస్తున్నారు. 'స్పిరిట్'తో పాటు దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న 'ఫౌజీ', అలాగే దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందిస్తున్న 'కల్కి 2' చిత్రాల పనుల్లో కూడా పాల్గొంటున్నారు. భారీ ఒత్తిడి మధ్య కూడా ప్రతి సినిమాకు పూర్తి న్యాయం చేస్తూ ప్రభాస్ ఎంతో అంకితభావంతో పని చేస్తున్నారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. 'స్పిరిట్' చిత్రాన్ని 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎనిమిది భాషల్లో విడుదల కానున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు.

# నిశ్శబ్దంగా ఓటీటీలోకి 'బ్యాడ్ బాయ్ కార్తీక్'

**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్ యువ హీరో నాగ శౌర్య ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్' థియేటర్లలో పెద్దగా సందడి లేకుండానే విడుదలై ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించలేకపోయింది. సినిమా విడుదలైన విషయం కూడా చాలామందికి తెలియని పరిస్థితి నెలకొనగా, ఇప్పుడు ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండానే నేరుగా ఓటీటీ వేదికలోకి రావడం ఆసక్తికరంగా మారింది. ప్రముఖ డిజిటల్ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ చిత్ర ప్రసార హక్కులను సొంతం చేసుకోగా, ప్రస్తుతం సినిమా వీక్షణకు అందుబాటులోకి వచ్చినట్లు సమాచారం. థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంటి వద్ద నుంచే సినిమాను వీక్షించే అవకాశం పొందుతున్నారు. ఈ చిత్రానికి కొత్త దర్శకుడు రమేష్ దేసిన దర్శకత్వం వహించారు. యాక్షన్ సన్నివేశాలను స్టైలిష్‌గా తెరకెక్కించినప్పటికీ, కథా కథనాలు పాత తరహాలో సాగడంతో ప్రేక్షకులను పూర్తిగా మెప్పించలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కథనంలో కొత్తదనం లేకపోవడం సినిమాకు ప్రధాన బలహీనతగా మారిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమాలో శ్రీదేవి విజయ్‌కుమార్, సముద్రఖని కీలక పాత్రల్లో నటించగా, విధి యాదవ్ కథానాయికగా కనిపించింది. సంగీతాన్ని హరీష్ జైరాజ్ అందించగా, నిర్మాణ బాధ్యతలను శ్రీనివాసరావు చింతలపూడి నిర్వహించారు. థియేటర్లలో ఆశించిన స్థాయిలో స్పందన రాకపోయినా, ఓటీటీలో యాక్షన్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులను ఈ చిత్రం ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# ఆలియా వ్యాఖ్యలపై చర్చ


**వేద న్యూస్ డెస్క్:**



బాలీవుడ్ ప్రముఖ నటి ఆలియా భట్ అంతర్జాతీయ సినీ ఉత్సవ వేదికపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటికీ పురుషాధిక్యత కొనసాగుతోందని ఆమె చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. సినిమాల్లో కథ కంటే హీరోలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆలియా అభిప్రాయపడ్డారు. చాలా చిత్రాలు ఇప్పటికీ హీరోల చుట్టూనే తిరుగుతున్నాయని, కథ బలంగా ఉండటమే అసలు ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. సినిమాను విజయవంతం చేసేది కేవలం హీరో కాదని, మంచి కథే ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. ఆమె వ్యాఖ్యలకు సామాజిక మాధ్యమాల్లో భిన్న స్పందనలు వస్తున్నాయి. కొందరు ఆలియా ధైర్యంగా నిజం మాట్లాడిందని ప్రశంసిస్తుండగా, మరికొందరు మాత్రం తీవ్ర విమర్శలు చేస్తున్నారు. భారతీయ సినిమాను తక్కువ చేసి మాట్లాడుతున్నారని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆమె భర్త నటించిన కొన్ని చిత్రాల్లో కూడా పురుషాధిక్యత కనిపించిందని, అలాంటి సినిమాలపై ఎందుకు స్పందించలేదని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమలో మార్పు గురించి మాట్లాడేవారు ముందుగా తమ చుట్టూ ఉన్న విషయాలపై స్పందించాలని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

# 'నాగబంధం'లో అనసూయ పవర్‌ఫుల్ లుక్

**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్ యువ హీరో విరాట్ కర్ణ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ఫాంటసీ థ్రిల్లర్ 'నాగబంధం' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది. ఐశ్వర్య మీనన్, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా నటి అనసూయ భరద్వాజ్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో అనసూయ గంభీరమైన, మిస్టరీతో నిండిన పాత్రలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆమె లుక్‌లో కనిపిస్తున్న తీవ్రత, ప్రత్యేకమైన శైలి సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఫాంటసీ మరియు థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రంలో విరాట్ కర్ణ ఒక విభిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పోస్టర్లు సినిమాలోని భారీ విజువల్స్ మరియు సాంకేతిక విలువలను ప్రతిబింబిస్తున్నాయి. అనసూయ కీలక పాత్రలో నటిస్తుండటం సినిమాకు మరింత ఆకర్షణగా మారింది. కథలో ఆమె పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. జూలై 3న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073